# సమదర్శనము ఉండినవాడు పండితుడు

జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీ జిహ్వాగ్రే మిత్రబాంధవాః
జిహ్వాగ్రే బంధనప్రాప్తిః జిహ్వాగ్రే మరణం ధ్రువమ్

ప్రేమస్వరూపులారా!

మాటలచేతనే మానవుడు రాజ్యములను సాధిస్తున్నాడు. మాటలచేతనే సర్వసంపదలను కోల్పోతున్నాడు. మాటలచేతనే మిత్రబంధువులను చేకూర్చుకుంటున్నాడు. మాటలచేతనే బంధువులను చేరతీస్తున్నాడు. మాటలచేతనే మరణమునుకూడ తెప్పించుకుంటున్నాడు. అన్నింటికిని మాటలే మూలము. కష్టసుఖములకు, శాంతిసుఖములకు, సిరిసంపదలకు మానవునియొక్క వాక్కు చాలా ప్రధానమైనది. జీవితము అరుదైనది. కాలము విలువైనది. హృదయము మృదువైనది. మనస్సు మహాగొప్పది. ఇట్టి సంపదకల్గిన మానవుడు ఈనాడు అల్పుడై, అజ్ఞుడై, అవివేకుడై అశాంతిని అనుభవిస్తున్నాడు. మానవ జీవితము ఎంత అరుదైనది, మధురమైనది, ఆనందమైనది అనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు. కారణము అలౌకికమైన తత్త్వాన్ని విస్మరించి, లౌకికము, భౌతికము, లోకసంబంధమైన వాంఛలే ప్రధానమని విశ్వసించి దానికి బానిసలై జీవితాన్ని మసిబొగ్గులకు అమ్ముకుంటున్నాడు మానవుడు. మానవ జీవితము మాణిక్యమనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు.

### ప్రతి మానవుడు కాలమునే అనుసరించాలిగాని కాలము ఎవరిని అనుసరించదు

కాలము మరింత విలువైనది. ఈ కాలము ఎవరికి మిత్రుడుకాదు. కాలము ఎవరిని అనుసరించదు. ఎట్టి శ్రీమంతుడైనా, అధికారి అయినా కాలము వారిని లెక్కచేయదు. ప్రతి

sri sathyasai vahinamrutam

మానవుడు కాలమునే అనుసరించాలి కాని కాలము ఎవరిని అనుసరించదు. ఈ కాలమును మానవుడు భౌతికమునకే వినియోగిస్తున్నాడు. కాయము కేవలము భౌతికమునకే ధారపోస్తున్నాడు. ఈ కాయము ఏ నిమిత్తమై ఏర్పడినదనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు. మానవత్వమును కోల్పోయి కేవలము పశుత్వాన్ని అనుభవిస్తున్నాడు, మానవుడు. హృదయమా మృదువైనది. ఇట్టి మృదువైన హృదయముకల మానవుడు శిలాహృదయుడుగా మారిపోతున్నాడు. మహా కఠినహృదయముగా మారిపోతున్నది. మానవత్వమునకు ఇట్టి హృదయము, మనస్సు చాలా విరుద్ధమైనది. కరగి ప్రవహించే కరుణతోకూడినది, మానవత్వము. కానీ మానవునియందు కరుణ కఠినరూపాన్ని ధరించింది. మనస్సు గొప్పది. అందువలననే కృష్ణుని ప్రార్థించాడు అర్జునుడు, 'చంచలం హి మనః కృష్ణా ప్రమాది బలవదృఢం' గొప్పది ఈ మనస్సు. దీనికి కన్నులు లేవు; కానీ అన్నింటిని చూడగలుగుతున్నాది. చెవులు లేవు; గాని ఎక్కడెక్కడ ఏమి జరుగుతున్నదో అన్నింటిని వింటున్నది. నోరులేదు ఈ మనస్సుకు; అన్నింటిని వల్లిస్తున్నది. కాళ్లులేవు ఈ మనస్సుకు; కానీ కాంతికంటె వేగముగా నడుస్తున్నది. ఇట్టి మనస్సుతత్వాన్ని మానవుడు గుర్తించుకోలేకపోతున్నాడు. మనసును ఆధీనము చేసుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ మనస్సుకు ఆధీనుడై ఉన్నాడు. మనస్సుకు ఆధీనుడై ఉండినంతవరకు మనస్తత్వము మనకు అర్థముకాదు.

**చదివిన చదువును ఆచరణలో పెట్టినవాడు గొప్పవాడు**

మానవత్వమును మొట్టమొదట గుర్తించాలి. శ్రీరామనవమి దినము చెప్పాను. రావణుడు 64 విద్యలు నేర్చిన ఘనుడు. రామునికంటె అతి విద్యావంతుడు, రావణుడు. రాములకు ప్రాకృతికంగా, ప్రాపంచికంగా, 34 విద్యలు మాత్రమే తెలుసు. కానీ 64 విద్యలు నేర్చిన రావణుడు ఏమి సాధించాడు? '64 విద్యలు అరుదారుగ నేర్చినట్టి ఆ రావణుడే నిరవధిక సుఖము కనుగొని పరమానందము నాడు పొందగలేదే'. 64 విద్యలు నేర్చి ఏమి శాంతిని సాధించాడు? ఏమి ఆనందమును అనుభవించాడు? సర్వసుఖములు అతని చేతిలో ఉంటున్నాయి. ఆకాశమునందే మేడలు కట్టుకున్నాడు. శరీరమునకు

సంబంధించిన భోగభాగ్యములకు తక్కువలేదు. కానీ సుఖములేదు, శాంతిలేదు. అందువల్లనే రావణుడు భౌతిక సంపదలలో గొప్పవాడు. భౌతిక సుఖశాంతులలో గొప్పవాడు. భౌతికమైన తెలివితేటలలో గొప్పవాడు. భౌతికవిద్యలలో గొప్పవాడు. కానీ, మంచివాడు కాదు. రాముడు మంచివాడు. దేనివల్ల? తాను నేర్చిన విద్యలను చక్కగా ఆచరణలో పెట్టి జీర్ణించుకున్నాడు. ఈ జీర్ణమైన ఆహారము మనస్సుకు దృష్టి, తృప్తి, పుష్టి అందిస్తుంది. దానివల్ల జీవితము ఆదర్శవంతమైన జీవితముగా రూపొందుతుంది. చదివిన విద్యలను జీర్ణించుకున్నవాడు రాముడు. కనుక నిరంతరము ఆనందముతో శాంతితో కాలమును గడుపుతూ వచ్చాడు. పట్టాభిషేకం సమయములో ఏ ఆనందమును అనుభవించాడో అరణ్యమునకు పోయే సమయములో అదే ఆనందాన్ని అనుభవించాడు. చదివిన చదువు జీర్ణించుకున్నవాడు. 'సుఖేదుఃఖే సమేకృత్వా లాభేలాభౌ జయాపజయౌ'. సుఖదుఃఖములు రెండింటియందు సమత్వముగా ఉంటాడు. వేదములు, శాస్త్రములు అట్టివానికి 'పండితః' అని పేరు పెట్టాయి. ఎవరు పండితుడు? వేదశాస్త్రఇతిహాస పురాణములు ఘనముగా నేర్చినవాడా పండితుడు? సకలశాస్త్రములు స్వాధీనము గావించుకున్నవాడా పండితుడు? కాదు కాదు. 'పండితాః సమ దర్శినః' అన్నారు. సమదర్శనము ఉండినవాడు పండితుడు. తుచ్ఛమైన విద్యలచే ఏర్పడేదికాదు పాండిత్యం. చదివిన చదువును జీర్ణించుకొని నర నరములకు రక్తమువలె ప్రవహింపచేసుకునేది విద్య. రక్తము దేహమంతా సరఫరా అయినట్టుగా ఈ విద్యకూడా, విద్యతోబాటు గుణములుకూడా సరఫరా జరగాలి. కానీ రావణుడు జీర్ణించుకోలేకపోయాడు. 64 విద్యలు నేర్చిన రావణునికి అజీర్ణరోగము బయలుదేరింది. ఆచరణలో పెట్టలేదు. అజీర్ణముగా రూపొందింది. ఈ అజీర్ణముయొక్క ఫలము ఏమి? అహంకారము, ఆడంబరము పెరిగాయి. చదివిన చదువులు జీర్ణించుకోలేకపోవటంచేత అహంకార ఆడంబరములనే రోగములకు గురౌతున్నాడు మానవుడు. జీర్ణించుకోలేని విద్యలు అనారోగ్యమునకు దారితీస్తాయి. జీర్ణించుకున్న విద్యలు ఆనందము.

**గొప్ప విద్యావంతులవలన దేశానికి ఉపకారముకన్న అపకారమే ఎక్కువ**

sri sathyasai vahini

దురదృష్టవశాత్తు ఈనాటి విద్యలన్నీకూడను కేవలము గ్రంథపరిచయముగా కనిపిస్తున్నాయి. పరీక్షా హాలువరకు ఈ విద్యలు బుఱ్ఱలో పెట్టుకుంటున్నారు. పరీక్షాహాలులోనుంచి వెనుకకు వస్తూనే రాసిన ఆన్సర్సుకూడా వానికి జ్ఞాపకముండవు. అలాంటి విద్యావంతులు లోకానికి ఏమి ఉపకారము చేయగలరు? గొప్పవిద్యావంతులైనవారు దేశద్రోహులేగానీ, దేశఉపకారులు కారు. తల్లిదండ్రులకు ధనము నష్టము, జీవితమునకు గుణము నష్టము. ఇక సమాజమునకు జీవితమే నష్టము. కనుక ఎంత చదివినా జీర్ణించుకోటానికి తగిన విశ్వాసము పెంచుకోవాలి. ఏమి పాస్ చేశావు అంటే పెద్దపెద్ద డిగ్రీలు చెబుతావు. M.Sc, M.Com, MBA ఈ విధంగా అక్షరాలంతా పెట్టుకుంటారు. ఈ డిగ్రీలు చేతబట్టి ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్నారు. తుచ్ఛమైన డిగ్రీలు. ఇవన్నీ దేనికోసం? పొట్టకూటికోసం ఉండవలసిందేకానీ, పొట్టకూటికి యిన్నీ మోసములా? తనను తాను మోసం చేసుకుంటున్నాడు. తనకు తాను పెడమార్గము పడుతున్నాడు. తనకు తాను హీనుడై పోతున్నాడు. ఇలాంటి బ్రతుకు ఏమి బ్రతుకు? మానవబ్రతుకా ఇది పశుబ్రతుకా? ఇదికాదు మానవబ్రతుకు. మన్సూర్ అనే విద్యార్థి ఒకడు ఉత్తరప్రదేశములో ఉండేవాడు. మహమ్మదీయుడు. కానీ అతను ప్రారంభమునుండి దైవవాణిని చింతించుకుంటూ నిరంతరము దైవచింతనలో కాలము గడుపుతూ వచ్చాడు. అతని కుటుంబము చాలా బీదకుటుంబము. ఎంత బీదకుటుంబమైనప్పటికి కుమారుని చదివించాలనే ఆశ తల్లితండ్రులకు సహజము. తల్లితండ్రులు మన్సూర్‌ను స్కూలులో చేర్పించి చదివించాలని ఎంతో ప్రయత్నించారు. ఆ పిల్లవాని హృదయము అద్దమువంటిది. పరిశుద్ధమైనటువంటి అద్దములోనే నీ ప్రతిబింబము చక్కగా కనిపిస్తుంది. అద్దములో ప్రతిబింబము కనిపించటానికి కారణం ఏమిటి? ఒట్టి అద్దమే తీసుకువస్తే ప్రతిబింబము కనిపించదు. అద్దమునకు ఆవలనున్న రూపము కనిపిస్తుంది. ఆ అద్దమునకు అటువైపున మెర్క్యురీ రసాయనము పూసినప్పుడు ప్రతిబింబము కనిపిస్తుంది. హృదయమనే అద్దమునకు పరిశుద్ధమైన ప్రేమ అనే మెర్క్యురీ చేర్చారు. అద్దములో తన ప్రతిబింబము సుస్పష్టముగా కనుపిస్తుంది. అప్పుడు ఈ లోకముతో తనకు అవసరములేదు. 'నన్ను నేను చూసుకుంటున్నాను. ఇదియే నా జీవితలక్ష్యము', అని తనలో తాను దృఢం చేసుకున్నాడు.

srisathyasaivacharamrutam

తల్లితండ్రులు స్కూలుకు పొమ్మని చెప్పారు. పిల్లవాడు ప్రశ్నించాడు, 'దేనికోసం?' అని. తల్లితండ్రులు చెప్పారు, 'చదువుంటే కదా పొట్టకూటికి, గుడ్డకు ఏ కొదవలేక జీవిస్తావు' అని. 'అమ్మా! క్షమించు నన్ను. కుక్కలుకూడా కడుపునింపుకుంటున్నాయి. అవి ఏ చదువు చదివాయి? కోతులు ఆకలైతే ఏదో కడుపు నింపుకుంటున్నాయి. ఏమి చదువులు చదివాయి? చీమలు, పక్షులు, సర్వజీవరాసులు పొట్ట నింపుకుంటున్నాయి. పొట్ట నింపుకోటంకోసం చదువు చదవాలా?' అని ప్రశ్నించాడు. కనుక, పొట్టకోసమైతే చదువు అక్కరలేదు. పొట్ట ఒక బుట్ట. చెత్తకుండి మాదిరి వేసేదంతా ఆ పొట్టలో పడిపోతున్నాయి. 'ఇలాంటి చెత్తకుండివంటి పొట్టకోసమని నాయొక్క శక్తిని, దివ్యత్వాన్ని ధారపోసుకోటమా? నాకు అక్కరలేద'న్నాడు. ఎక్కడికో వెడుతున్నాడు. చిన్న పిల్లవాడు. కానీ, తేజస్సు పరిశుద్ధముగా, పరిపూర్ణంగా ఉండటంచేత మహాబ్రహ్మతేజస్సుగా కనుపిస్తున్నాది. తాను ఎవరిని అడగటంలేదు. తేజస్సే అన్నింటిని అందిస్తుంది. దారిలో ఎవరో ఒక తల్లి 'నాయనా! భోజనం పెడతానురా!' అని పిలిచేది, భోజనం పెట్టేది. ఎవరు పెట్టిస్తున్నారు, ఈ భోజనము? పరిశుద్ధమైన హృదయమే పెట్టిస్తున్నాది. ఆ పవిత్రమైన ప్రేమయే కలిపిస్తున్నాది. ఎక్కడికిపోయినా తాను కేవలం 'నేను దైవము, నేను దైవము. అనల్‌హక్. అనగా నేనే దైవము' అంటున్నాడు. అదే భారతీయ శాస్త్రములందు 'అహం బ్రహ్మాస్మి' 'సోహం' నేనే ఆ బ్రహ్మను. ఈ విధంగా పిల్లవాడు ఉచ్చరిస్తూ పోతున్నాడు. ఈ మాటలు అనేకమందికి హాస్యముగా కనిపించాయి. పెద్దలందరు అతనిని నిందించారు. 'పిల్లవాడా! నీవే దైవమంటున్నావు, నీవు ఎట్లా దైవము?' అని ప్రశ్నిస్తూ వచ్చారు. మూర్ఖులు వాదానికి సంసిద్ధులై ఉంటారు. తనలో ఏకించిత్ జ్ఞానములేకపోయినా వాదానికి సిద్ధమైపోతుంటారు. ఇలాంటి మూర్ఖులు ఈ కలియుగములో అధికమై పోతున్నారు. తనకు విశ్వాసముంటుంది. నేనే దైవమనే విశ్వాసముతో 'నీకు లేకపోతే పో! అంతేకానీ నా విశ్వాసము ఎందుకు నీవు పాడు చేయటం?' అని ప్రశ్నించాడు వారిని. దీనిని నమ్మలేని చుట్టూ ఉన్నవారు 'నీవు ఎట్లా దేవుడవుతావు? ఎందుకు దేవుడు అని చెబుతున్నావు?' అని తిరిగి ప్రశ్నించారు. 'నేను దేవుడు కాబట్టే దేవుడని చెబుతున్నాను. బల్బులన్నిటిలో కరెంటు ఏవిధంగా చేరిపోతున్నాదో అన్ని దేహములందు దైవము ఆ రీతిగా చేరిపోతున్నాడు. ఆ ప్రకాశాన్ని కొంతమంది



srisathyasaivachanamrutam

దుర్వినియోగము చేసుకుంటారు. కొంతమంది సద్వినియోగము చేసుకుంటారు. ఆ లైటుముందు చదువుకుంటూ, రాసుకుంటూ కాలము సద్వినియోగము చేస్తారు. కొంతమంది ఆ లైటును దుర్వినియోగము చేసుకుంటారు. నేను సద్వినియోగము చేసుకుంటున్నాను అని దృఢవిశ్వాసముతో పలికాడు. ఈ లోపల పండితుల గుంపు చేరిపోయింది. 'ఇన్ని శాస్త్రములు, వేదములు చదివాము కానీ మేము ఆ విధంగా చెప్పలేకపోతున్నాము. ఏమీ తెలియనివాడు ఇంత ఘంటాపథంగా నొక్కి చెబుతున్నాడు. ఈ ధైర్యము ఎక్కడనుంచి వచ్చింది?' అని ఆశ్చర్యపోయారు, పండితులు. ఈ ధైర్యమునకు పాండిత్యముకాదు ప్రధానము, హృదయవిశ్వాసమే! ఎవరు ఎన్ని చెప్పినా మన విశ్వాసము మనము చలింపచేసుకోకూడదు. అట్టి దృఢవిశ్వాసము కల్గిఉండాలి విద్యార్థులు. పండితులు రాజు దగ్గరకు వెళ్లారు. 'మా పాండిత్యమునకు చాలా అవమానము చేస్తున్నాడు ఈ పిల్లవాడు. మేము ఎన్ని విద్యలు చదివినా మేమే దైవమని మేము చెప్పలేకపోతున్నాము. ఏ అక్షరజ్ఞానములేని మూర్ఖుడు నేనే దైవమంటున్నాడు. ఇది ఎట్లా అవుతుంది? ఇతను పిచ్చివాడైనా కావాలి లేక అహంకారి అయినా కావాలి. దీనిని ఎట్లైనా అణగదొక్కాల'ని ఫిర్యాదు చేశారు.

**ఊరక సజ్జనుండొదిగి యుండిననైన దురాత్మకుండు ని**
**ష్కారణ మోర్వలేక అపకారము చేయుట వాని విద్యగా**
**చీరలు నూరు టంకములు చేసెడివైనను పెట్టెనుండగా**
**చేరి చినింగిపోగొరుకు చిమ్మటకేమి ఫలంబు.....**

నూరురూపాయల బెనారస్ చీర పెట్టుకో, లేక బాత్‌రూమ్ తుడిచే గుడ్డపెట్టుకో, కొట్టేది చిమ్మెట స్వాభవము. దీనికి యింత విలువే ఇంత విలువరాదు అని విచారము చేయదు. అదేవిధముగా ఒకరిని విమర్శించటము white ant జాతి. ఎట్టి వారినైనా విమర్శించుటకు పూనుకుంటారు.

**(తేదీ 31-03-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahanamrutam